## ఈ వారం కథ

ఎడ్రసు కనుక్కోవడం అంత కష్టం కాలేదు. "డా. కె. మురళీమోహన్, సైకియాట్రిస్టు" అన్న బోర్డు కింద ఉన్న బాణం జెరాక్స్ షాపుకి ఆనుకొని ఉన్న ఇరుకు మెట్ల వైపు చూపిస్తోంది. నేనూ, నా వెనక మా అమ్మాయి పద్మ మెట్లెక్కాం. పది దాటి అయిదు నిమిషాలే అవుతోంది. అపాయింట్‌మెంట్‌కి అట్టే ఆలస్యం కాలేదు. రోడ్డు మీంచి ఉధృతంగా వస్తోన్న వాహనాల మోత మమ్మల్ని డాబా మీది వరండా వరకూ వెంటాడి, రిసెప్షన్ రూమ్‌లో తగ్గిపోయింది. ఎవరూ లేరు. పద్మని సైకియాట్రిస్టు దగ్గరకి తీసుకెళ్ళకుండా ఇన్నేళ్ళూ నెట్టుకొచ్చాను. ఇక తప్పలేదు. మా అల్లుడు దాన్ని వదిలేస్తానని బెదిరిస్తున్నాడు. అతని బిజినెస్ కోసం లక్ష రూపాయిలిస్తేతీసుకెళతానని పరోక్షంగా తెలియజేశాడు. ఈ గొడవలన్నీ ఈ డాక్టర్‌తో ఎలా చెప్పకోవడం? అసలింతకీ ఇతనెలాంటి వాడో?...ఇలానా ఆలోచనలన్నీ చిక్కులు పడుతున్నాయి. వెనక్కి తిరిగి ఇంటికి పోదామా అని కూడా అనిపించింది. ఒక్క క్షణం సేపు, పైన ఫ్యాను తిరుగుతోంది. దాని గాలికి పాత మేగజైన్లు రెపరెపమంటున్నాయి.

షేం వచ్చిన అలికిడి విన్నాడుగాబోలు, డాక్టరు తన గది తలుపు తీసి, మొహం బయట పెట్టి, నవ్వుతూ,

"లోపలికి రండి. మీ కోసమే చూస్తున్నాను" అన్నాడు.

లోపలికినడిచాం. అతనికి నలభై ఏళ్ళుండొచ్చు. తెల్లగా, బాగా పొడుగ్గానన్నగా ఉన్నాడు. సోడా బుడ్డీ కళ్ళద్దాలు. అది చిన్నదే అయినా నీటుగా ఉన్న ఎయిర్ కండిషన్డ్ రూమ్. చల్లగా, నిశ్శబ్దంగా వుంది. మా వెనకాతల తలుపు దానంతట అదే మూసుకోగానే రోడ్డు మీది రొద స్తంభించిపోయింది. సన్నగా ఎయిర్ కండిషనర్ మోత వినవస్తోంది, కుర్చీలో కూర్చుంటుండగా మళ్లీ అనిపించింది. "చేస్తున్న పని సరైందేనా" అని.

డాక్టరు మాకెదురుగా రివాల్వింగ్ ఛెయిర్‌లో కూర్చొని వెనక్కి చేరబడ్డాడు. ఎలా మొదలు పెట్టాలా అని నేను తటపటాయిస్తూ ఉంటే, అతనొక్క ఉదుటున ముందుకు వంగి టేబిల్ మీద తెరిచి ఉన్న డైరీలోకి చూసి,

జగన్నాథరావు... 'పేషెంటు పేరు పద్మావతి, మీ అమ్మాయి అవునా?" అన్నాడు.

అప్పుడు చూశాను. అతని టేబిల్ మీద బేండేజీ చుట్టలు విడిపోయి చిందర వందరగా పరుచుకొని ఉన్నాయి. వాటి మధ్య మెరుస్తూ ఒక సర్జికల్ కత్తెర.

"మీరు కట్లు కూడా కడతారా?" అన్నాను. అప్రయత్నంగా వాటిని హడావుడిగా సర్దుతున్న వాడల్లా చటుక్కున తలెత్తి ఒక్క క్షణం నాకేసి తేరిపార చూశాడు. సోడా బుడ్డీ కళ్ళద్దాల్లోంచి తెల్లని అతని మొహం ఎర్రబడింది. నెమ్మదిగా చిరునవ్వుతో రిలాక్స్ అవుతూ మళ్ళీ తన కుర్చీలో వెనక్కి జేరబడ్డాడు. నవ్వు మొహంతో.

"ఒక్కోసారి అవసరం అవుతాయి. కొందరు పేషెంట్లు వయొలెంట్‌గా ఉంటారు. దెబ్బలు తగిలించుకొని వస్తారు.ఫస్ట్ ఎయిడ్.... అంతే" అన్నాడు. టేబిల్‌కి ఉన్న డ్రాయర్‌ని కొద్దిగా లాగి, ఆ బేండేజీలన్నింటినీ లోపలికి తోస్తూ.

"ఇప్పుడు చెప్పండి" అన్నాడు.

ఎందుకోగాని ఈ చిన్న సంఘటనతో నాలోని టెన్షన్ ఎగిరిపోయింది. మొదలు పెట్టాను.

"మా అమ్మాయి చిన్నప్పట్నించి అదోలా ఉండేది. ఎవరితోనూ ఎక్కువగా కలిసేది కాదు. స్కూల్లో కూడా స్నేహితులంటూ ఎవరూ లేరు. ఎంత సేపూ తన చదువు, ట్యూషన్లు, పుస్తకాలు... ఇదే ప్రపంచం. మార్కులు బాగానే వచ్చేవి. మేమూ అంత పట్టించుకోలేదు. ముంగిలా అలా మాట్లాడవేమే' అని ఒక్కోసారి చికాకు పడేవాళ్ళం. అంతే ఒక డాక్టరుకి చూపిస్తే, "డిప్రెషన్ అన్నాడు..."

చేతులు తల వెనక్కి కట్టుకొని జేరబడి వింటున్న వాడల్లా ఒక్క ఉదుటున చేతుల్ని దించి ముందుకి వంగి.

"ఆగండాగండి. జబ్బుల పేర్లు చెప్పకండి. లక్షణాలు చెప్పండి" అన్నాడు డాక్టరు.

అప్పుడోసారి పద్మ వంక చూశాను. అది తదేక ధ్యానంతో టేబిల్ మీద పరిచిన అద్దం కింద వున్న ఏదో మందుల ఎడ్వర్టయిజ్‌మెంటు వైపు చూస్తోంది. అలా చూస్తూ గంటలు గడిపెయ్యగలదు. దాని బుర్రలో ఏమవుతుందో మాకెవరికీ అంతు పట్టలేదు ఎన్నాళ్ళయినా.

మళ్ళీ మొదలు పెట్టాను. "ఇలాగే నండి. మాట్లాడదు. ఎటో చూస్తూ కూర్చుంటుంది. బుద్ధి పుడితే ఏదైనా ఇంటి పని చేస్తుంది. లేకపోతే లేదు. స్కూలు కాగానే చదువు మాన్పించేశాం. పెద్ద మార్పు లేదు. ఉన్నట్టుండి ఒక్కోసారి ఏడుస్తుంది. ఎందుకో చెప్పదు. ఎప్పుడోగాని నవ్వదు. పిచ్చి అనలేంగాని నార్మల్ కాదు."

"నార్మల్? నార్మలేమిటండీ – ఏమిటసలు మీ ఉద్దేశం?" అన్నాడు డాక్టరు కాస్త ఆవేశంగా. నేను చెప్పిన దాంట్లో ఏదైనా పొరబాటు జరిగిందా అని ఆలోచిస్తున్నాను.

"నార్మల్, ఎబ్ నార్మల్ ఇవన్నీ మనం కల్పించుకున్నవే. ఏది నార్మలో ఏది కాదో ఎక్కడైనా రాసి పెట్టి ఉందా చెప్పండి?"

నా మీద ఎందుకింత విరుచుకుపడుతున్నాడా అని అనుకుంటూ ఉంటే, అతను డ్రాయర్ లాగి గబగబా దేనికోసమో వెతకనారంభించాడు, ఒక చేత్తో టేబిల్ మీద ఉన్న రెండో చెయ్యి కొద్దిగా వణుకుతోంది. డ్రాయర్ లోంచి సిగరెట్ పేకెట్ బయటికి తీసాడు. ఇక అగ్గిపెట్టె కోసం గాబోలు, మళ్ళీ వెతుకులాట. మొత్తానికి సిగరెట్టు వెలిగించాడు. సిగరెట్టు తాగే డాక్టర్ని చూడడం నాకదే మొదటిసారి. అదీ పేషెంటు ముందు అతని ప్రవర్తన నాకు నచ్చలేదు.

ఒక దమ్ము లాగి. "నే చెప్తా వినండి" అన్నాడు. బాగా ముందుకి వంగి నా మొహం మీద మొహం పెట్టాడు. నేను ఇబ్బందిగా జరగబోతూ ఉంటే నా మీద గుప్పుమని పొగవదిలాడు. పైగా నవ్వి

"చూశారా ఎంత ఇబ్బంది పడ్డారో! పరాయి వాళ్ళకింత దగ్గరగా రాకూడదు, వచ్చినా వాళ్ల మీద సిగరెట్టు పొగ వదలకూడదు. అవునా? ప్రతీ చిన్న విషయంలోనూ, ఇలా ప్రవర్తించాలి. ఇలా ప్రవర్తించకూడదు, అని ఎవరూ మనకి చెప్పరు. చిన్నప్పుడయితే కొన్ని రూల్సుంటాయనుకోండి. కాని రాను రాను మనమే మన చుట్టూ ఉన్న వాళ్ళని గమనిస్తూ మన ప్రవర్తనని అలవరచుకుంటాం. నిజానికి సిగరెట్టు పొగ మనుషుల మీద వదలకూడదనే నియమం ఎక్కడా లేదు కదా?"

పద్మ కిసుక్కున నవ్వి."నేను చదివాను" అంది. ఇంతసేపటికి దాని నోటమ్మట మాట పెగిలినందుకు ఆశ్చర్యపడి దాని కేసి తిరిగాను. తల పైకెత్తి డాక్టర్ కేసి ఆసక్తిగా చూస్తోంది.

ఇద్దరూ ఒకేసారి నవ్వడం మొదలుపెట్టారు. ఆయన సడెన్‌గా ఆగి సీరియస్‌గా మొహం పెట్టాడు.

"రోడ్డుకి ఎడమ వైపుగాపోవలెను అనేది ఒక నియమం. చాలా మంది దాన్ని పాటిస్తున్నా ఏక్సిడెంట్లు అవుతున్నాయి. కాని వాహనాలు ఎలా పెరిగిపోయాయంటే అసలురోడ్డే కనబడదు. మరి వాటి పొగ, గోల, కాలుష్యం. ప్రమాదాలు – వాటి సంగతేమిటి?' అని ఒక్క క్షణం ఆగి – ఏదో గొప్ప సంగతి చెప్పబోయే వాడిలా – మళ్ళీ అందుకున్నాడు.

"అందుకే ఏ నియమాలకైనా పరిమితులుంటాయి. అసలీ కట్టుబాట్లన్నీ స్థల కాలాల బట్టి మారుతూ ఉంటాయి. అప్పటి కప్పుడు పనికొచ్చే వర్ధనమ్మ గారి రూల్సండీ ఇవన్నీ.




"అయితే మీరు చేసింది రైటంటారా?"

"అసను అన్ని నియమాల వెనకా ఒకే సూత్రం ఉంది. ఇంకోళ్ళకి హాని చెయ్యకూడదు. ఇప్పుడున్న సంఘానికి, ముఖ్యంగా. కాని నేనింకోటంటాను. అడ్డమైన నియమాలు పాటించి మనకి మనం కూడా హాని చేసుకో కూడదు. అవునా? అయితే నేనీ సిగరెట్టుఎందుకుకలుస్తున్నానాఅనుకుంటున్నారు కదా? నాలెడ్జి డస్ నాట్ ఫ్రీ అజ్ ఫ్రం అవర్ బర్డెన్స్. అన్నీ తెలిసియుండి అజ్ఞానమేలరా అన్నాడు" తన జోక్‌కి తనే పెద్దగా నవ్వుతూ.

అప్పుడు నాకర్థమైంది. ఈయనదంతా ప్రాక్టికల్‌గా చేసి చూపించే తత్త్వం అన్నమాట. ఇలాంటి వాళ్ళతో తీరిగ్గా కూర్చొని చర్చించుకుంటే బోలెడు విషయాలు తెలుస్తాయి. కాని ఇప్పుడు వచ్చిన పని అది కాదుగా. మళ్ళీ ప్రయత్నించాను.

"అది కాదండీ. మా అమ్మాయి కూడా అందరి లాగే పెళ్ళి చేసుకొని పిల్లల్ని కని సుఖంగా ఉండాలని..." అనబోతూ ఉంటే అడ్డు తగిలి మళ్ళీ ముందుకి వంగి ఏదో రహస్యం చెప్తున్నట్లు.

"గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర' చదివారా?' అనడిగాడు.

"లేదు"

"రావి శాస్త్రి" అంది పద్మ.

"కరెక్ట్. వెరీ బ్రైట్ గర్ల్. ఇంత చురుకైన అమ్మాయిని పట్టుకొని సైకియాట్రిస్టు దగ్గరకి తీసుకొస్తారా? షి మేబి సో నార్మల్ దట్ షి యూస్ ఎబ్నార్మల్"

ఆయన మాటలు సగం సగం అర్థమౌతున్నాయి. పద్మలో ఇదివరకెప్పుడూ చూడని కొత్తదనం.

"మీరు చెప్పేది బాగానే ఉంది డాక్టరు గారూ, అది తెలివయినదే గాని అందరి లాంటిది కాదు. మాకు చిన్నప్పట్నుంచీ తెలుస్తూనే వుంది. కాని ఏం చెయ్యడం? బోధపడడం లేదు..."

బోధపడదు. ఏదైనా అసలు బోధపడుతుందీ? ఏదీ బోధపడదు. అదే గమ్మత్తు. అదే హింస" అన్నాడు.

కూర్చున్న వాడల్లా లేచిపోయి, సిగరెట్టు ఏష్ట్రేలో పడేసి టేబిల్ వెనక పచార్లు చెయ్యడం మొదలుపెట్టాడు. సడెన్‌గా ఆగి.

"బోధ పడాలంటే ఒక రహస్యం ఉంది. బోధపరచుకొనే ప్రయత్నం ఆపెయ్యండి. అసలా మాటకొస్తే ఎంతోమంది మొదలే పెట్టరు. అందుకే అంత హాయిగా హింస పడుతూ, కుళ్లుతూ, పడుతూ లేస్తూ ఉంటారు. ఎప్పుడో ఓ రోజు ఛస్తారు."

అతని మాటల్లో ఏదో అర్థం కాని ఆవేశం ధ్వనించింది.

"అయితే అది వేరే విషయం" అంటూ కుర్చీలో కూలబడ్డాడు. ఒక్కనిమిషం నిశ్శబ్దంగా గడిచిపోయింది.

"అయితే మా అమ్మాయికే జబ్బూ లేదంటారా?" అనడిగాను చివరికి.

లేకేం కావలసినంత ఉంది. అసలు జబ్బు లేని వాడెవడు? అందరూ మరల్లా తిరిగి తిరిగి మనసుల్ని ఎప్పుడో అరగదీసేసుకున్నారు. ఇప్పుడక్కడ ఇంకేం మిగల్లేదు. వెర్రి ఆలోచన్లు. అవీ లేకపోయినప్పుడు శూన్యం."

నేనింకా ఈయనేవే మందులు రాసిస్తే అవి వాడదాం. తగ్గుతుందేమో అని ఆశపడి వస్తేఈ శనిమాటలన్నీ ఎందుకు చెబుతున్నట్టు నాతో? మాటలతోనే జబ్బు తగ్గుతుందా? కనీసం జబ్బుందని ఒప్పుకున్నాడు కదా.

"మందులేవైనా రాస్తే వాడుతుంది... కాస్త ఖరీదైనవైనా ఫరవాలేదు. నాకు మెడికల్ రీ ఎంబర్స్‌మెంట్ ఉంది" అన్నాను ధైర్యం చేసి.

"మందులు – ఎందుకొచ్చిన మందులండీ. అన్నిటికీ ఏవో పాడు సైడ్ ఎఫెక్ట్స్. అసలు మన శరీరంలో ఎన్ని రకాల కెమికల్స్ ఎన్ని సున్నితమైన రియాక్షన్లు జరుపుకొంటూ మనల్ని నడిపిస్తున్నాయో మీకు అయిడియా వుందా? వాటన్నింటినీ ధ్వంసం చేస్తాం మనం ఈ మందుల్తో. అసలు మన పరిష్కారాల్లోంచే పుట్టుకొస్తాయండీ మన సమస్యలన్నీ. అదేమంటే ట్రాజెడీ ఆఫ్ మోడర్న్ మేన్. నాగరికత పెరుగుతున్న కొద్దీ కొత్త జబ్బులు వాటికి కొత్త మందులు ఇంకా కొత్త జబ్బులు. ఇదీ వరస అంత దాకా ఎందుకు? ఎయిడ్స్ అంటే ఏమిటో ఒక్క తరం ముందు వాళ్ళెవరికైనా తెలుసా?

డాక్టరు కెమికల్సు అనగానే నాకు గుర్తుకొచ్చింది. సందేహం కూడా నివృత్తి చేసుకుందామని.

"మా ఫామిలీ డాక్టరుగారు లిథియం లెవల్ సరిగ్గా లేకపోతే కూడా..." అనబోయాను.

"లిథియం, సోడియం, కాల్షియం, యూరేనియం, ఫ్లూటోనియం – ఇవన్నీ నాకు చెప్పకండి. అన్నీ బాగా స్టడీ చేశాను. అంతా ఉత్తది. వాటి మానాన వాటిని ఉండనిచ్చి జోక్యం చేసుకోకుండా ఉన్నంత ఉత్తమం లేదు."

నా సహనం సన్నగిల్లింది.

"అయితే దేన్నీ పట్టించుకోకుండా అలా వదిలెయ్యమంటారా?"అన్నాను.

ఏదో అనాలని నోరు తెరిచాడు డాక్టరు. ఇంతలో ఫోను మోగింది. ఒక్క క్షణం దానికేసి ఆశ్చర్యంగా చూసి ఎత్తాడు. "హలో" అన్నాడు. అవతలి గొంతుక ఏమందో వినబడలేదు.

పద్మకేసి తిరిగాను. మళ్లీ అదే పనిగా ఓ పక్కకి చూస్తోంది. నేను అటు వైపు చూశాను. అక్కడ బుక్ రేక్ మీద ఫ్లవర్ వాజ్‌లో ఎర్ర గులాబీలు, మొగ్గలు, ఎంతో అందంగా, గ్రేస్‌ఫుల్‌గా గుమిగూడి ఉన్నాయి. అవి ఎంత అద్భుతంగా తమ స్వంత ప్రపంచాన్ని సృష్టించుకున్నాయని! చూపుల్లోనే స్పర్శకి తెలుస్తూఎంత మృదువుగా ఉన్నాయి. వాటిరేకలు! అన్నిటికీ అతీతంగా, అత్యంత సహజంగా... సర్వం మర్చిపోయి వాటికేసి చూస్తూ ఉండిపోయాను. పద్మ మీద ఎంతో జాలీ, వాత్సల్యం పుట్టుకొచ్చాయి."అయ్యో పిచ్చి తల్లీ" అనుకున్నాను.

"నన్ను డిస్టర్బ్ చెయ్యొద్దు" అని కఠినంగా అన్న డాక్టరు గొంతుక విని అటు చూశాను. ఫోన్ తీసిపక్కనేపెట్టాడు. అప్పటికి వరకూ మేం ఇద్దరం ఆ గులాబీల్ని తదేకంగా చూడ

(మిగతా పక్క పేజీలో)




# వరదస్మృతి

(వరదస్మృతి, వెల: 200 రూపాయిలు, ప్రతులకు : విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలలో)

అబ్బూరి వరదరాజేశ్వరరావుగారిని ఆయన బంధుమిత్రులంతా 'వరద'గానే సంబోధిస్తారు. ఆంధ్ర సాహిత్యలోకానికి ప్రేమపాత్రుడైన ఈ సాహితీమూర్తి తన 70వ యేట 1994లో శ్వాసకోశ వ్యాధితో నిమ్స్ హాస్పటల్‌లో మరణించారు. ఆయన భార్య శ్రీమతి ఛాయాదేవి (ఈమె సుప్రసిద్ధురాలైన రచయిత్రి), శీలా వీర్రాజు, కుందుర్తి సత్యమూర్తిగార్లతో ఏర్పడిన సంపాదక వర్గం వరద స్మృతి చిహ్నంగా ఈ సంపుటిని కూర్చేరు. దీనిలో ఆయన చిన్నతనం నుంచి రాసిన లేఖలు, మిత్రులూ, బంధువులూ రాసిన లేఖలు, వ్రాసిన కథలు, నాటకాల అనువాద ప్రయత్నాలు, సగం రాసినవీ, రాయడానికై రాసుకున్న నోట్సు, మరణానంతరం వచ్చిన సామభూతి ఉత్తరాలు, పత్రికలలో మిత్రులు వ్రాసిన సంస్మరణ వ్యాసాలు, మరణశయ్య మీదనే మాట్లాడలేని స్థితిలో కాగితాల మీద గిలికిన బాధలు, వ్యధలు – ఒకటేమిటి 'వరద'ను స్మరణకు తెచ్చే ప్రతి కాగితాన్నీ సేకరించేరు. ఈ సంపుటం ఆఖరు అట్ట మీద పరిచయం చేసినట్లు ఇది స్వీయచరిత్ర, జీవిత చరిత్ర కలగలసిన సజీవ చిత్రణ. వరదస్మృతులూ వరదను గురించిన స్మృతులూ కలగలసిన అపూర్వ సంగమం.

ఆసుపత్రిలో మంచం మీద వుండి మాట్లాడలేని స్థితిలో ఆయన గిలికిన (పుటలు 447,448, 449) లఘు వ్యాఖ్యలు ఆ సమయంలో ఆయన అనుభవిస్తుండిన బాధను, విసుగును, సహజమైన హాస్య ప్రవృత్తినీ చూపుతూ పాఠకుల మనస్సులను ద్రవింపచేస్తున్నాయి. ఈ బాధలు పడకుండా చనిపోయివుంటే బాగుండేది అనిపిస్తుంది.

సంస్మరణ వ్యాసాలలో రావిశాస్త్రి, ఆరుద్ర, నామిని రచనలు 'వరద' జీవితంలోని వివిధ దశలలో ఆ వ్యక్తినీ, పరిసరాలనూ గుర్తుతెస్తున్నాయి.

స్మృతి గ్రంథాలలో మనవాళ్ల అతిశయోక్తులూ, అబద్ధాలతో గాని ఆయన గొప్పదనాన్నీ, ఆయనతో తనకున్న పరిచయం ప్రాముఖ్యాన్నీ మనకి చెప్పలేరనుకుంటాను. దీనిలో కూడా అటువంటివి చోటు చేసుకోకుండా వుండలేదు. 1954 తర్వాత 'వరద' నాయకత్వాన కవిత (త్రైమాసిక సాహిత్య పత్రిక) రెండు సంచికలు వచ్చేయి. దానిలో ప్రచురించిన ఉత్తమ ప్రమాణాలు కలిగివుండేటట్లు వరద విశేష శ్రద్ధ తీసుకున్నారని చెప్తూ నగ్నముని వానిలో వెలువడిన రచనలు ఆ రచయితలకు సీనియరు కవుల గౌరవం కలిగించాయంటారు. అటువంటి వారినిగా అజంతానూ, తిలక్‌నూ పేర్కొంటారు. తెలుగు కవులలో సీనియారిటీ, జూనియారిటీల కలన అట్టే మంచిది కాదు. అది స్పర్ధకి మాత్రమే దారితీస్తుంది. అదీగాక ఆయన పేర్కొన్న ఇద్దరూ 1946–48ల నాటికే లబ్ధప్రతిష్ఠులు.

స్మృతి గ్రంథాలు ఆ సంకలన కర్తలకు చనిపోయినవారితో గల అనుబంధానికి చిహ్నాలు. ఆ వ్యక్తి బంధువులకూ, సన్నిహిత మిత్రులకూ వాని మీద ఆసక్తి వుంటుంది. జ్ఞాపకం చేస్తాయి. మిగిలినవారికి ఆయన రచనలే జ్ఞాపికలు. నాకు 50–60 ఏళ్ల క్రితం చదివిన ఓ కథ గుర్తువస్తూంటుంది. ఇంగ్లండు నుంచి 'Q' అనే పత్రిక వచ్చేది. దానిలో చదివేను. ఒక మహా రచయిత చనిపోయాడు. కొన్నేళ్లకి అతని ఆత్మకి తన్నెవరన్నా తలుచుకుంటారా అని సందేహం కలిగి, మన ప్రపంచం అంతా గాలించింది. అందరూ, బంధువులు, వారసులతో సహా మరిచిపోయారు. ఇల్లూ, వాకిలీ అన్నీ పరాధీనం అయాయి. కూలిపోయాయి. అతన్ని జ్ఞాపకం చేసేవి ఏవీ లేవు. నిరుత్సాహంగా తిరిగిపోతూంటే ఓ సెంటకుప్ప మీద ఓ కాగితం ఎగురుతూ కనిపించింది. అది అతని ఒక రచనలో ఒక పుట. అంటే అతనింకా కొందరి స్మృతిపథంలో కన్నా వస్తున్నాడన్నమాట. ఆ సంతృప్తితో ఆతని ఆత్మ తిరిగి పోయిందని 'Q'లోని కథ.

మరుపు అనేది ప్రకృతి ప్రాణుల కిచ్చిన ఓ వరం. ఆ వరాన్ని స్మృతిగ్రంథాలు కంగాళీ చేస్తాయని నాకో భయం వుంది. అయితే ఈ 'వరదస్మృతి' చదివేక నాకు మాత్రం విశేషమైన బాధ కలిగింది. దీనిని చదివేక ఈ వ్యక్తితో నేనెందుకు పరిచయం పెట్టుకుని, స్నేహం చేసుకోలేకపోయానని విచారం కలిగింది. ఆయన స్నేహితులంతా నాకు స్నేహితులే. ఆయనలాగానే సాహిత్యరంగంతో పరిచయం వున్నవాడిని. పరిచయాలు చేసుకోవడంలో చొరవా, శ్రద్ధా కలవాడిని. ఆయన కూడా అటువంటి స్వభావం కలవాడేనని ఈ పుస్తకం తోపిస్తుంది.

ఒకరినొకరం ఎరగమూ అనుకోడానికి పూర్తిగా వీలులేదు. 10–12 ఏళ్ల క్రితం తెలుగు అకాడమీలో బూదరాజు వద్ద నుండగా ఆయన వచ్చేరు. పరస్పరం ఎరిగివున్నట్లే ఓ నాలుగైదు నిముషాలు మాటలు నడిచేయి. తరువాత నేను వచ్చేశాను. అంతక్రితం అటు తరవాత ఆయనతో పరిచయం ఎందుకు పెంచుకోలేకపోయానా అని ఇప్పుడు విచారం కలుగుతూంది. ఆ విధంగా స్మృతి గ్రంథాల అవసరం ఒక దానిని ఈ 'వరద స్మృతి' పూర్తిచేస్తూంది. దీని సంపాదక మండలి సభ్యులుగా శ్రీమతి ఛాయాదేవికి అభినందనలు.

– మహీధర రామమోహనరావు

# ట్రెజరీ ఆఫ్ నాలెడ్జ

(రచన: ఎస్.నాగేంద్రనాథ్‌రావు, ఎం.ఎ., బి.ఇడి, వెల: డెబ్బయ్ అయిదు రూపాయిలు, ప్రతులకు: పల్లవి పబ్లికేషన్స్, కార్ల్‌మార్క్స్‌రోడ్, విజయవాడ–520 002)

సివిల్ సర్వీసెస్, ఎ.పి.పి.ఎస్.సి., యు.పి.ఎస్.సి., బి.ఎస్.ఆర్.బి., ఎస్.ఎస్.సి, డివిజనల్ అక్కౌంటెంట్స్– ఆడిటర్స్, యు.డి.సి. మొదలైన అన్ని కాంపిటేటివ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు హ్యాండ్‌బుక్‌గా వుండదగిన పుస్తకం ఇది. మొత్తం పది కొండువేలకు పైగా ఆబ్జెక్టివ్ ప్రశ్నలు–జవాబులు వున్నాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, హెల్త్ సైన్స్, సైకాలజీ, కంప్యూటర్ సైన్స్, మాథమాటిక్స్, ఎకనామిక్స్, జియోగ్రఫీ, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, లిటరేచర్ సబ్జెక్టులను విడివిడి అధ్యాయాలుగా ప్రచురించినందువల్ల తమకు కావాల్సిన సబ్జెక్టును చదువుకునే అవకాశం పాఠకులకు వుంది. అన్ని సబ్జక్టులనూ కలగా పులగంగా కలిపి జనరల్ నాలెడ్జ్ పుస్తకం అనే దానికన్నా ఈ పద్ధతి బావుంది. అంతే కాకుండా స్పోర్ట్స్, జనరల్‌నాలెడ్జిలలో సబ్జెక్టువైజ్‌గా ముఖ్యమైన బిట్సు సేకరించి పొందుపరిచారు. 588 పేజీలతో ఆఫ్‌సెట్‌లో అందంగా ముద్రించిన ఈ పుస్తకం నిజంగా విజ్ఞానఖనే.

# స్వీకారం

## గెరిల్లా గుండె లయలు

కవితా సంకలనం, రచన: అనామధేయుడు. వెల: అయిదు రూపాయిలు, ప్రచురణ: విప్లవ రచయితల సంఘం, నెల్లూరు జిల్లా యూనిట్, ప్రతులకు: వి. వెంచయ్య, 6–5–13, కావలి – 524 201.

## ఈ 'కాలమ్' కథలు

రచన: వేదగిరి రాంబాబు, వెల: ఇరవై రూపాయిలు, ప్రతులకు: వేదగిరి కమ్యూనికేషన్స్, 1–8–481, II అంతస్తు, వెంకటేశ్వర స్వామి గుడి వీధి, హైదరాబాద్–20

## చిత్రపటం

వ్యాస సంపుటి, రచన: శంకర వెంకట నారాయణరావు, వెల: పదిహేను రూపాయిలు, ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలలో.

# ఆలోచన

(పక్క పేజీ తరువాయి)

డాన్ని గమనించినట్టున్నాడు. గభాలున లేచి ఆ ఫ్లవర్ వాజ్‌ని మోసుకొచ్చి మా ముందు టేబిల్ మీద పెట్టాడు.

"సృష్టిలో ఎంత సుందరమైన, సున్నితమైన సమతుల్యం ఉందో చూశారా? ప్రతీ పువ్వులోనూ, మొగ్గలోనూ, ఆకులోనూ అది మనకి కనిపిస్తుంది' అన్నాడు మాకేసి తిరిగి.

"మనం ఈ ప్రయాణంలో ఆ సిమెట్రీని, బేలన్స్‌నీ పోగొట్టుకున్నాం. మీ అమ్మాయికేమందూ అక్కర్లేదు. నా మాట నమ్మండి. నిజంగా ఎబ్నార్మల్ వాళ్ళు వేలూ లక్షలూ ఉన్నారు. వాళ్ళందర్నీ నయం చెయ్యాలి. ఎప్పటికవుతుందో. అయినా నా ప్రయత్నం నేను చెయ్యాలి కదా. నా కవతల బోలెడు పనులున్నాయి. అర్జెంటుగా వెళ్ళాలి. గుడ్‌బై" అని లేచి తలుపు వైపు నడిచాడు డాక్టరు.

నేను నిర్ఘాంత పోయి, "అదేమిటి మీరలా వెళ్ళిపోతే ఎలా? మమ్మల్నేం చెయ్యమంటారు?" అన్నాను.

"కాసేపు ప్రశాంతంగా కూర్చోండి. మీ అమ్మాయికి వెళిపోవాలనిపిస్తే వెళ్ళండి. ఆమెకు ఎలా తోస్తే అలా చెయ్యండి"

"మరి మీ ఫీజు?"

"అవసరం లేదు" అని నవ్వాడు. తలుపు తెరుచుకొని వెళ్ళిపోయాడు. ఇదేం డాక్టరు? ఇదేం కొత్తరకం వైద్యం?

పద్మ ఇంకా అలానే గులాబీల వంక చూస్తోంది. ఎయిర్ కండిషనర్ చేస్తోన్న హమ్మింగ్ తప్ప ఇంకే శబ్దం లేదు.

అలా ఎంతసేపు కూర్చున్నామో. ఆ డాక్టరు వింత మాటలన్నీ గుర్తుకొస్తున్నాయి– ఒకటి ఒకటీ. వాటిల్లో ఏదో అంతరార్థం దాగి వున్నట్టనిపించింది. ఆలోచించగా ఆలోచించగా మెరుపు మెరిసినట్టు ఒక్కసారి అర్థం అయింది. ఈ అర్థంలేని గొడవల్లోపడి ఎందుకింత రొష్టుపడ్డాను– అనిపించింది. పద్మని ఆ అల్లుడుగాడు తీసికెళ్తేనేం, లేకపోతేనేం? పాపం పిచ్చితల్లి! నా దగ్గరే ఉంటుంది. నాకామాత్రం స్తోమత లేకపోలేదు. అంతేగాని వాడి బ్లాక్ మెయిల్‌కి లొంగనుగాక లొంగను. ఎవరేమనుకుంటే నాకేం? కొండంత ధైర్యం కలిగింది. ఇదన్నమాట డాక్టరు చెప్పదలచుకున్నది! ఎన్నడూ ఇంత స్థిమితంగా లోతుగా ఆలోచించనే లేదు.

"పద నాన్నా, వెళ్దాం" అంది పద్మ.

"పద తల్లీ" అని లేచాను. అది ముందు నడిచింది. మా వెనక తలుపు మూసుకుపోతూ వుండగా ఎర్రగులాబీలు మాకు



వీడ్కోలు చెప్పినట్టనిపించింది. ఇంతలో టక్ టక్ మని చప్పుడు. తలుపుని మళ్ళీ తెరిచాను. ఆశ్చర్యంగా ఉంది. మరింత గట్టిగా టక్ టక్ టక్ టక్... ఆ గదికి వెనక వైపు మరో తలుపు ఉండడం గమనించాను. పద్మని బయటి రిసెప్షన్‌లో కూర్చోమని సైగ చేసి ఆ తలుపు వైపు నడిచాను. టక్ టక్... సందేహం లేదు అక్కడ్నించే. నెమ్మదిగా తలుపు తీశాను. బాత్ రూమ్ తలుపు పూర్తిగా తీసి అదిరిపడ్డాను. ఒక బట్టతలాయన కిందపడి ఉన్నాడు. నోరూ, కాళ్ళూ, చేతులూ బేండేజీలతో కట్టి ఉన్నాయి. నెమ్మదిగా గుమ్మం వైపు పాకుతూ ఏవో సంజ్ఞలు చేస్తున్నాడు. గబగబా అతని కట్లు విప్పడానికి ప్రయత్నించాను. ఊడి రాలేదు. డాక్టర్ టేబుల్ మీది కత్తెర గుర్తు కొచ్చింది. కొద్ది నిమిషాల్లోనే ఆయన లేచి నుంచొని వళ్ళు విరుచుకుంటున్నాడు. "మీరు?" అన్నాను ప్రశ్నార్థకంగా.

"డాక్టర్ మురళీమోహన్" అని వెళ్ళి డాక్టర్ కుర్చీలో కూర్చున్నాడు. నాకు అర్థం కావడం లేదు. బాటిల్లోంచి గ్లాసులో నీళ్ళు పోసుకుని తాగుతున్నాడు. పొట్టిగా నల్లగా ఉన్నాడు. చాలా నెమ్మదస్తుడిలా కనిపించాడు.

"మరి ఆయనెవరండీ–ఆ పొడుగ్గా–తెల్లగా ఇంత సేపు ఇక్కడ కూర్చున్నాయన?" అన్నాను తడబడుతూ.

"కామేశ్వర్రావని నా పేషెంట్. మొదట్లో వయొలెంట్‌గా ఉండేవాడు. ఇప్పుడు చాలా నయం. ఈ రోజు క్లినిక్ తెరవగానే వచ్చి ఒక్క రోజు సైకియాట్రిస్ట్‌గా ఉంటానని వేధించుకు తిన్నాడు. ఎంత చెప్పినా విన్నాడు కాడు. అసలెప్పట్నించో అతనికిదో సరదా. అందరి మానసిక రోగాలనూ నయం చెయ్యగలనని అతనికి ధీమా. విపరీతి తెచ్చిపోయి నన్నిలా కట్టేసి బాత్‌రూమ్‌లో పడేసి పోయాడు. మిమ్మల్నేం ఇబ్బంది పెట్టలేదు కదా?"

"లేదులెండి" అన్నాను. తన ముందున్న డైరీ తీసిచూసి,

"మీరు జగన్నాధరావు గారనుకుంటాను. మీ అమ్మాయిని తీసుకొచ్చారా? సారీ, ఈ రోజు చూడలేను. సోమవారం ఉదయం తొమ్మిది కల్లా వచ్చెయ్యండి. ఓకే?" అని డైరీలో రాసుకున్నాడు. ఫోన్ తీసి "కామేశ్వర్రావు ఫేమిలీకి తెలియజెయ్యాలి" అన్నాడు.

అతను ఫోన్లో ఏదో మాట్లాడుతున్నాడు. నాకంతా అయోమయంగా ఉంది. ఒక నిమిషం అలాగే ఉండిపోయి "అయితే సోమవారం మళ్ళీ వస్తాం డాక్టరుగారూ" అని వెళ్ళిపోబోతూ ఆగి "అతని మాటల్లో కూడా ఏదో సబబూ సందర్భం, లాజిక్, రేషనాలిటీ ఉన్నట్టే అనిపించిందండీ. పిచ్చివాడని తెలుసుకోలేక పోయాను" అన్నాను.

డాక్టర్ చిరునవ్వుతో "అతని లాజిక్, రేషనాలిటీ అతని కున్నాయి. వేరే ప్లేన్‌లో" అన్నాడు.

ఇంకేమనాలో తెలియలేదు. పద్మని తీసుకొని మెట్ల వైపు నడుస్తూంటే వెర్రిగా హారన్ల మోత. పెద్దగా చప్పుడు. ఏక్సిడెంట్, వరండా అంచుకొచ్చి పిట్టగోడ నానుకొని నిలబడిపోయాం ఇద్దరం. ఒక స్కూటర్ కుర్రాడు కిందపడ్డాడు. చొక్కానిండా రక్తం. గుద్దిన లారీ రోడ్డుకి అడ్డంగా తిరిగి మిగతా ట్రాఫిక్‌ని అడ్డింది. జనం గుమిగూడారు. సోడాలు కొడుతున్నారు. స్కూటర్ కుర్రవాడు లేచి సోడా తాగుతున్నాడు. అతని టిఫిన్ బాక్సుగాబోలు రోడ్డుమీదపడి విడిపోయింది. ఒక గజ్జి కుక్క మెతుకుల్ని నాకుతోంది. ఒక ఆటోవాడు దాని బలంగా ఒక్క తాపు తన్నాడు. కుయ్యి కుయ్యి మంటూ అది గుంపు నుండి దూరంగా తొలగింది. పోలీసులు వచ్చారు. ఇక చూడలేక గబగబా మెట్లు దిగి ఆటో చేసుకున్నాం.

"ఆదు రైట్నించి ఒచ్చేసాదు. లారీవోదు ఆదిదే తప్ప, స్కూటరోదు పాపం లెప్ట్ నుంచే ఎల్తన్నాదు" అని ఆటోవాడు మాకు బోధ పరిచాడు అడక్కపోయినా.

ఆ తరువాత ఈ సంఘటనలను గురించి చెప్తే చాలా మంది జోక్ కింద తీసుకొని నవ్వే వాళ్ళు. టూకీగా చెప్తుకుంటే జోకే. కాని వివరాల్లోకి పోతే మాత్రం. ఎర్రగులాబీల్ని చూసినప్పుడల్లా నాకు కామేశ్వరరావు మాటలే గుర్తుకొచ్చేవి. కాని అనుభవాలూ, జ్ఞాపకాలూ మన సంకెళ్ళని ఛేదించవు కదా! చాలా ఏళ్ళ తరువాత ఒకసారి స్టేషన్‌లో చూశాను కామేశ్వర్రావుని. బాగా చిక్కిపోయి నల్లబడ్డాడు. తెగ మాసిన బట్టలు. చెప్పుల్లేవు. గెడ్డం పెంచాడు. కళ్ళజోడూ లేదు. గొంతుకలో తీవ్రత మాత్రం అలాగే వుంది. ఖాళీగా వున్న నాలుగు, అయిదో నెంబర్ల ప్లాట్‌ఫారంల మధ్య హడావుడిగా తిరుగుతున్నాడు. నాలుగో నెంబరు అంచున నిలబడి, "ముత్తుస్వామి యీజ్ గోయింగ్ టు మెడ్రాస్" అని పదే పదే అరుస్తున్నాడు. మళ్ళీ అయిదో నెంబరు ప్లాట్‌ఫారం మీదికి పరుగెత్తుకెళ్ళి, "రాజు యీజ్ గోయింగ్ టు బోంబే" అంటాడు. మధ్యలో "సాతాస్రికా, సాతాస్రికా" అంటున్నాడు. టీకొట్టు కుర్రాడు కపిరి టీ పోస్తే ఎంతో ఇష్టంగా లొట్టలు వేసుకుంటూ తాగాడు. అంతే. ఆ తరువాత మళ్ళీ అతన్నెప్పుడూ చూడలేదు.

పద్మకి మురళీమోహన్‌గారి మందులు బాగా పడ్డాయి. విడాకులు తీసుకుంటానని పట్టుబట్టి సాధించుకుంది. నేనెంత చెప్పినా వినలేదు. టైపు నేర్చుకుని చిన్న ఉద్యోగం చేస్తోంది. బియ్యేకి కట్టింది. ఎలా అయితే అలాగే అవుతుందని ధైర్యం తెచ్చుకున్నానుగాని తోటి ఆడపిల్లల్లా సుఖంగా సంసారం చేసుకుంటూ పిల్లల్ని కనలేదనే దిగులు పూర్తిగా పోలేదు.